


ప్రగతి కళాశాలలో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, 'జాతీయ యువజన దినోత్సవం' సందర్భంగా విద్యార్థి దశలో విద్యార్థులందరూ క్రమశిక్షణ, ప్రతిభ, అకుంఠిత దీక్షతో బాటు సేవా తత్పరత కలిగి ఉండాలని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచారు. డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి.హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూర్పులో రాజకీయ వేడి

- అభ్యర్థుల ఖరారులో వైసిపి
- జాబితాపై స్పష్టత లేని టిడిపి, జనసేన పార్టీలు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజకీయం వేడెక్కుతుంది. గెలుపే లక్ష్యంగా ఆయా పార్టీలు సాగుతున్నాయి. అధికారం చేపట్టేందుకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. దీనిలో భాగంగా అధికార వైసిపి ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాపై కసరత్తులు దాదాపుగా పూర్తి చేసింది. కొన్ని స్థానాల అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించగా మరికొన్నింటిని పెండింగ్‌లో ఉంచింది. ఈ నెల 20 తేదీలోపే వాటిని కూడా ప్రకటించే అవకాశం ఉంది. ఇదే సందర్భంలో జనసేన, టిడిపి పొత్తులో ఉండగా సీట్ల సర్దుబాటు అంశంపై ఇంకా ఇరు పార్టీల మధ్య క్లారిటీ కనిపించడం లేదు. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్‌లో అనుకున్న సమయానికి సార్వత్రిక ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటనపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఆ పార్టీల ఆశావహుల్లో టెన్షన్ వాతావరణ నెలకొంది. అధికార వైసిపి అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తోంది. గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టింది. దానిలో భాగంగానే కాకినాడ జిల్లాలో పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట సిట్టింగ్ ఎంఎల్ఎలు పెండెం దొరబాబు, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, జ్యోతుల చంటిబాబు స్థానాల్లో కాకినాడ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మాజీ మంత్రి తోట నరసింహంకు టికెట్లను ఇటీవల కన్ఫర్మ్ చేసింది. కాకినాడ సిటీ నుంచి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి సిట్టింగ్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, తుని నుంచి మంత్రి దాడిశెట్టి రాజా, పెద్దాపురం నుంచి దవులూరి దొరబాబు పోటీలో వుండనున్నారు. వీరి అభ్యర్థిత్వం కూడా దాదాపుగా ఖరారు అయినట్లే. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో నుంచి ఎంపీ మార్గాని భరత్ రామ్, రూరల్ నుంచి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణలను ఖరారు చేస్తూ ఇటీవల అధిష్టానం ప్రకటించింది. రాజానగరం నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, అనపర్తి నుంచి సత్తి సూర్యనారాయణ రెడ్డి, నిడదవోలు నుంచి శ్రీనివాస నాయుడు, కొవ్వూరు నుంచి తానేటి వనిత పోటీలో ఉండనున్నారు. దీనిపై అధిష్టానం ప్రకటనే తరువాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అధికార పార్టీ నుంచి ఇప్పటికే పి.గన్నవరం నియోజకవర్గ నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు స్థానంలో జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రామచంద్రపురంలో మంత్రి వేణు స్థానంలో పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌కు అధికారికంగా టిక్కెట్లను ఖరారు చేసింది. అమలాపురం నుంచి మంత్రి పినిపే విశ్వరూప్ లేదా ఆయన కుమారుడు శ్రీకాంత్‌కు టికెట్ కేటాయించే అవకాశం ఉంది. ముమ్మిడివరం నుంచి పొన్నాడ సతీష్ కుమార్‌కు, రాజోలు రాపాక వరప్రసాద్‌కు, కొత్తపేట చిర్ల జగ్గరెడ్డికి, మండపేట తోట త్రిమూర్తులుకు దాదాపుగా టికెట్లు ఖరారు అయ్యాయి.

టిడిపి, జనసేనలో రాని స్పష్టత

టిడిపి జనసేన పొత్తులో ఉండగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెజార్టీ సీట్లను గెలుచుకోవాలని ఆ పార్టీలు భావిస్తున్నాయి. సీట్ల సర్దుబాటు అంశంపై రెండు పార్టీలు ఇంకా క్లారిటీకి రాలేదు. జనసేన కాకినాడ రూరల్, పిఠాపురం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, రాజమండ్రి రూరల్, రాజానగరం, కొత్తపేట అసెంబ్లీ స్థానాలను అడుగుతున్నట్లు సమాచారం. దీనిపై ఇరు పార్టీల మధ్య ఇంకా సఖ్యత కుదరలేదు. ఒకవేళ ఆ పార్టీ ఆశించినట్లుగా ఇక్కడ టికెట్లు కేటాయిస్తే కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ, పిఠాపురం నుంచి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, ముమ్మిడివరం నుంచి పితాని బాలకృష్ణ, రాజోలు నుంచి బొంతు రాజేశ్వరరావు, రాజమండ్రి రూరల్ నుంచి కందుల దుర్గేష్, రాజానగరం నుంచి బత్తుల బలరామ్, కొత్తపేట నుంచి బండారు శ్రీనివాస్ పోటీలో ఉండే అవకాశం ఉంది. జనసేనకు మూడు జిల్లాల్లోనూ కాకినాడ రూరల్, పిఠాపురం, రాజోలు, ముమ్మిడివరం, రాజమండ్రి రూరల్, రాజానగరం వంటి 6 స్థానాలను మాత్రమే కేటాయించే అవకాశం కనిపిస్తుంది. ఒకవేళ సీట్ల సర్దుబాటు గనుక పూర్తయితే కాకినాడ జిల్లాలో టిడిపి తరపున తుని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య, కాకినాడ సిటీ నుంచి మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, పెద్దాపురం నుంచి నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాడు నుంచి వరుపుల రాజా సతీమణి సత్యప్రభ, జగ్గంపేట నుంచి జ్యోతుల నెహ్రూ బరిలో నిలవనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి సిటీ నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు నుంచి మాజీ మంత్రి జవహర్, నిడదవోలు నుంచి బూరుగుపల్లి శేషారావు, గోపాలపురం నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావులు పోటీలో ఉండే అవకాశం కనిపిస్తోంది. అటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం అసెంబ్లీ బరిలో ఆనందరావు, ముమ్మిడివరం నియోజవర్గం నుంచి దాట్ల బుచ్చిబాబు, పి.గన్నవరం బరిలో హరీష్, రామచంద్రాపురం నుంచి సత్య స్కాన్ అధినేత కాదా వెంకటరమణ, మండపేట నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావులు బరిలో నిలుచునే అవకాశం ఉంది. అయితే టిడిపి అధిష్టానం వీరిని ఇంకా ఖరారు చేయలేదు. ఇదిలా ఉండగా రెండు పార్టీల్లోనూ సీట్ల సర్దుబాటు అంశం పెద్ద తలనొప్పిగా మారే అవకాశం కూడా ఉంది.

అంబేద్కర్ స్ఫూర్తితో ముందడుగు

ప్రజాశక్తి-కాకినాడ



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ, ఎంఎల్‌సి, అధికారులు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఈ నెల 18 వరకూ ప్రభుత్వ పరంగా పలు వేడుకలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా చెప్పారు. రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడలో 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఇంద్రపాలెం వంతెన వద్ద ఉన్న అంబేద్కర్ కాంస్య విగ్రహానికి కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు తదితరులు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌పిలు, సిఒలు, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో రాజ్యాంగానికి కట్టుబడి అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతామని కలెక్టర్, ఎంఎల్ఎ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి కలెక్టరేట్ వరకు మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక సమతా సంకల్పం పేరుతో అన్ని సచివాలయాల్లోను, ప్రభుత్వ కార్యాలయాలు వద్ద అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించడంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా 125 అడుగుల కాంస్య విగ్రహం మన రాష్ట్రంలోనే ఏర్పాటవుతోందన్నారు. అంబేద్కర్ ఆశయ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమం కోసం అంబేద్కర్ చూపిన బాటలో ఆయన ఆశయాలను అమలు చేస్తూ ఏర్పాటు చేస్తున్న కాంస్య విగ్రహం, స్మృతి వనం చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కార్పొరేషన్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించడం, సంతకాల సేకరణతోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్‌సిటీ ఎస్ఇ వెంకట్రావు, ఇఇ మాధవి, ఎఇ నాగేశ్వరరావు, సూపర్ బజార్ డైరెక్టర్ రావూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ద్వారానే ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు జరుగుతాయని మాజీ కేంద్రమంత్రి ఎంఎం.పల్లంరాజు అన్నారు. శుక్రవారం పెద్దాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లు గడిచినా ఈనాటికీ రాష్ట్రంలో ప్రత్యేక హోదా, విభజన హామీల అమల కోసం తెలుగుదేశం, వైసిపిలు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ద్వారా ప్రత్యేక హోదా విభజన హామీలు అమలుతో పాటు మహిళలకు ప్రతి నెలా ఆర్థిక సాయం, రూ.500కు గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షల సాయం వంటి పథకాలు అమలు జరుగుతాయన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, తుమ్మల దొరబాబు, ముప్పన వీర్రాజు, కందుల వెంకటచలం, తోట సోనీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్ కుమార్

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చర్చల్లో అంగీకరించిన హామీలను వెంటనే నెరవేర్చాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. హెచ్ఆర్ పాలసీ అమలుకు ఎస్ఎస్ఎ అధికారులు, జిఎడి, ఫైనాన్స్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి విధివిధానాలు రూపొందించడానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మినిమం టైమ్ స్కేల్ సమగ్రశిక్షా, కెజిబివి ఉద్యోగులకు 0-5, 5-10, 10-15 సీనియారిటీ ప్రాతిపదికన అమలుపై నిర్ణయించేందుకు, 2017 నుండి వేతనాలు పెరగని 7 వేల మందికి 23 శాతం వేతనాలు పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, పిఎఫ్ అమలుకు సానుకూలంగా ఉన్నట్టు తెలిపారన్నారు. పిటిఐలను ఒకేషనల్ టీచర్లుగా, సిఆర్ఎంటి, ఐఇఆర్‌పి, సైట్ ఇంజనీర్లకు డిజిగ్నేషన్ మార్చేందుకు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు, మండల ఎకౌంటెంట్లకు ఈక్వలెంట్ కేడర్లను గుర్తించి భవిష్యత్తు వేతన పెరుగుదలలో వర్తింపచేస్తామని, విద్యాశాఖలో రెగ్యులర్ ఉద్యోగాల నియామకాలకు సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజ్ ఇచ్చేలాగున, కారుణ్య నియామకాలు చేపట్టి, అన్ని కేడర్లకు జాబ్ చార్టులు విడుదల చేస్తామని, రాబోయే పిఆర్సిలో అన్ని క్యాడర్లకు ఒకేసారి వేతనం పెంచుతామని, టెర్మినేట్ చేసిన 130 మందిని విధుల్లోకి తీసుకుంటామని, సమ్మె చేసిన రోజులకు వేతనాలు చెల్లిస్తామని, పెండింగ్ నవంబర్, డిసెంబర్ వేతనాలను తక్షణం విడుదల చేస్తామని చర్చల్లో ఎస్‌పిడి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ అంగీకరించారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తక్షణం ఆదేశాలు, జిఒలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంజాబ్, ఒడిషా, హర్యానా రాష్ట్రాల్లో వలె రెగ్యులరైజేషన్ కోసం సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనాగమణి, ఉపాధ్యక్షుడు ఎంవి.సాయికిరణ్, ఎ.లోవరాజు, పివివి.మహాలక్ష్మి, ఎం.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, జి.నారాయణ, ఎంబి.సాల్మన్, జిల్లా కోశాధికారి పి.రాజు, కె.శ్రీనివాస్, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి-కోటనందూరు

అల్లిపూడికి చెందిన వైసిపి మహిళా ఎంపిటిసి సభ్యురాలు నెమ్మాది నాగమణి (44) శుక్రవారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆమె మృతికి ఎంపిపి ఎల్.శ్రీనివాస్, వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, నాయకులు బండి నాని బాబు, కొత్తపల్లి మాణిక్యాలరావు, బొంగు గోపాలకృష్ణ, కొరుప్రోలు కృష్ణ, సుర్ల రాంబాబు, చిట్టిబాబు, నాగేశ్వరరావు, జగటాల వీరబాబు, గర్సింగు దొరబాబు, సర్పంచ్ తరిపే సత్తిబాబు సంతాపం తెలిపారు.

కాట్రవులపల్లిలో గడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో శుక్రవారం గడ్డివామి దగ్ధమయ్యింది. స్థానికులు తెలిపిన ప్రకారం కాట్రావులపల్లికి చెందిన పలివెల వీరబాబుకు చెందిన రూ.20 వేల విలువైన రెండెకరాల గడ్డి వామి దగ్ధమయ్యింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

యర్రవరంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ల నుంచి తమ సమితి సభ్యులు రక్తదానం చేస్తున్నారన్నారు. జిల్లాలోనే కాక వివిధ జిల్లాల్లో ప్రమాదంలో ఉన్న అనేక మందికి రక్తదానం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ శైలజ, విశ్రాంత వైద్యులు డాక్టర్ ఎవి.రమణ, సమితి సభ్యులు కుర్రా గోవింద్, సారా శ్రీను, రాము శ్రీను, డాక్టర్ రమేష్ ప్రసాద్, మధు, సౌజన్య, రాజేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల కోటి సంతకాల సేకరణ

అంగన్‌వాడీల కోసం కోటి సంతకాలు

అంగన్‌వాడీల సమ్మెకు ప్రజల మద్దతు కోరుతూ కోటి సంతకాల సేకరణకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 32వ రోజు ఆందోళనలు కొనసాగాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం



ఏలేశ్వరంలో సంక్రాంతి ముగ్గులతో అంగన్‌వాడీల నిరసన

కాకినాడ 24 గంటల రిలే దీక్షా శిబిరంలో సంతకాల సేకరణను ఐడియల్ కాలేజీ కరస్పాండెంట్ చిరంజీవినీ కుమారి తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యమం విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత మార్గంలో అంగన్వాడీలు చాలా పట్టుదలతో నెలరోజుల నుంచి ఉద్యమం నిర్వహిస్తున్నారని కొనియాడారు. మహిళలు మహాశక్తివంతులని నిరూపిస్తున్నారన్నారు. ఈ దీక్షా శిబిరంలో వీరమణి, సరోజిని, చామంతి, విజయ, సుధ, భవాని, సునీత, సుజాత, జోగమ్మ, వరలక్ష్మి, వ్యాపారమ్మ, రాధా, సునీత, సత్యవేణి పాల్గొన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల జెఎసి నాయకులు మహాలక్ష్మి, రాజు, గంగాధర్, సత్యనాగమణి, కిరణ్, చంటిబాబు, ఐద్వా నాయకులు భవాని, చెక్కా రమణి, జనవిజ్ఞాన వేదిక నాయకులు కెఎంఎంఆర్.ప్రసాద్, వర్మ మద్దతు తెలిపారు.

పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో అంగన్వాడీల సమ్మె శిబిరం వద్దకు మాజీ కేంద్రమంత్రి ఎంఎం.పల్లంరాజు, కాంగ్రెసు నాయకులు వచ్చి మద్దతు తెలిపారు. పల్లంరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ వ్యవస్థ ప్రారంభించి బలోపేతం చేశారన్నారు. మహిళలు, బాలింతలు, గర్భిణులు, బాలలకు అమ్మ తర్వాత అమ్మగా ఎన్నో సేవలందిస్తున్న అంగన్వాడీలను రోడ్డున పడేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్తిం చంటిబాబు, నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల దొరబాబు, సోనీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, క్రాంతికుమార్, సూరిబాబు, నాయకులు దాడి బేబీ, నాగమణి, అమల, ఎస్తేరు రాణి, బాలం లక్ష్మి, టిఎల్.పద్మావతి, లోవ తల్లి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, మన కుమారి, తులసి పాల్గొన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైంది. అనంతరం ర్యాలీగా మున్సిపల్ సెంటర్‌లోని అంగన్వాడీల సమ్మె శిబిరం వద్దకు వెళ్లి ఐద్వా నాయకులు మద్దతు తెలిపారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, పద్మ, నేదునూరి రమ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు అంగన్‌వాడీల సమ్మెకు ఐద్వా నాయకులు రమణి, ఫాతిమా, వరలక్ష్మి, గంగాభవాని మద్దతు తెలిపారు.

కోటనందూరు సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ నాయకులు, ఆశ, మిడ్డే వర్కర్లు సిబ్బందితో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు లీల, జగదీష్, లోవ, పద్మ, ఆమని నాగమణి పాల్గొన్నారు.

కరప ఐద్వా ప్రచార జాతా తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం వద్దకు వచ్చింది. ఐద్వా నాయకులు సిహెచ్.రమణి, వరలక్ష్మి, భవాని, ఫాతిమా, వెంకటలక్ష్మి మద్దతు తెలిపారు. అంగన్వాడీలు వీరవేణి, ఎం.వరలక్ష్మి, భవాని, సాయి, కల్పలత పాల్గొన్నారు.

ఏలేశ్వరం అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకరపల్లి సునీత, ఎస్.అమలావతి, సిహెచ్.వెంకటలక్ష్మి, జె.రాణి, పి.నూకరత్నం, ఆర్.రత్నకుమారి, పి.దుర్గాసూర్యకుమారి, కె.రమ్య, పి.గంగాభవాని, కె.బంగారుపాప, బి.కృపావతి ఉన్నారు.

పిఠాపురం (గొల్లప్రోలు) తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో సంతకాల సేకరణ చేపట్టారు. డి.పద్మావతి, సిఐటి నాయకులు కె.చిన్న మాట్లాడారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.పద్మ, మెడికల్ రిప్ డి.ప్రసాద్ రావు మద్దతు తెలిపారు. డి.తులసీదేవి, విజయశాంతి, వి.వెంకటలక్ష్మి, ప్రజావాణి, రామలక్ష్మి, అమల, సూర్యకాంతం, సత్యవతి, నళిని, వి.సునీత పాల్గొన్నారు.



కాకినాడలో సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న చిరంజీవినీ కుమారి




పెద్దాపురంలో ఐద్వా జాతా

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అభినందనీయం

కాకినాడ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడలో నిర్మించడం అభినందనీయమని పలువురు అన్నారు. గ్రామపంచాయతీలో కార్యదర్శి విజెవి.రమణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సభలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కామాడి గోవలక్ష్మి, కామాడి మాతరాజు, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ మాట్లాడారు. విగ్రహ ఏర్పాటుకు మద్దతుగా సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దలు, ప్రజా సంఘాల సచివాలయ కార్యదర్శి సాగర్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మైనేని వెంకటరత్నంకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

ఐక్య ఉపాధ్యాయ పత్రిక తొలి ప్రధాన సంపాదకుడు మైనేని వెంకటరత్నం వర్ధంతి సందర్భంగా స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో ఆయనకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. తొలుత మైనేని చిత్రపటానికి జోగా అప్పారావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 'ఉద్యమానికి ఆయుధం సాహిత్య అధ్యయనం' అనే అంశంపై జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.ప్రసాదరావు ప్రసంగించారు. సమాజంలో అనేక వివక్షలపై ముఖ్యంగా కుల, లింగ వివక్షతలపై జ్యోతీరావు పూలే, అంబేద్కర్, గురజాడ అప్పారావు వంటి వారు తమ రచనలను ద్వారా ప్రజలను జాగృతం చేసారని తెలిపారు. ఆర్థిక అసమానతలపై కారల్ మార్క్స్, శ్రీశ్రీ అనేక రచనలు చేశారని తెలిపారు. నేటి సమాజంలోని జాతి లింగ భాషా కుల వివక్షలపై అభ్యుదయ భావాలు కలిగిన అందరూ సాహిత్యం అధ్యయనం చేయాలని, చైతన్యవంతమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు వివి రమణ అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, చక్రవర్తి, వర్మ, పత్రికా బాధ్యుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల విజేతలకు మెమొంటోలు అందజేశారు.

21న జాతీయ స్థాయి సైన్స్ పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ

బాలికల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని, విద్యను ప్రోత్సహించేందుకు రేవతి సైన్స్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి అభినందించారు. శుక్రవారం తన కార్యాలయంలో రామచంద్రపురానికి చెందిన రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే జాతీయ స్థాయి సైన్స్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకూ బాలికలకు సైన్స్ పదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 21న రామచంద్రపురంలో రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.శ్రీకష్ణ సాయి మాట్లాడుతూ ప్రధానంగా సైన్స్ వినోదం, భౌతిక శాస్త్ర వినోదం, గణిత వినోదం ప్రయోగాలు నిర్వహిస్తారన్నారు. ఏదైనా సైన్స్ శాస్త్రవేత్తను అనుకరించి ఆయనను ప్రతిబింబించేలా ఏకపాత్రాభినయం, ప్రకృతి విజ్ఞాన శాస్త్రవేత్తలు అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ నెల 14వ తేదీలోగా https://bit.ly/revathiscienceawards 2024లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కెవిపి.సత్యనారాయణ, కాకినడ జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, అంబేదక్కర్ కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు చింతా నారాయణ మూర్తి, ఉండ్రాజవరపు శ్రీనివాసరావు, జాతీయ బాలల సైన్స్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సిఐ, ఎస్ఐ

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

యానాం ఏటిగట్టు మీదుగా మద్యం బాటిల్స్‌ను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోట గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ జానీ బాషా తెలిపారు. వారి వద్ద నుంచి తొమ్మిది యానాం మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రామచంద్రపురం సిఐ పి.దొర రాజు మాట్లాడుతూ సంక్రాంతి పండగల్లో ఎవరైనా కోడిపందేలు, పేకాటలు, గుండాట, అశ్లీల నృత్యాల వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

118 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని మీనా నగరం గ్రామానికి చెందిన ఆతుకూరి సుబ్బారావు నుంచి 118 కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు నిర్వహించకుండా తనిఖీలు చేపట్టామని ఎస్ఐ సిహెచ్.రమేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో కోడికత్తులను కలిగి ఉన్న సుబ్బారావును అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని కాండ్రేగుల గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన వివరాల ప్రకారం ఉన్నాయి. మండలంలోని కాండ్రేగుల గ్రామానికి చెందిన మేకల కార్తీక్ (30) అతని ఇద్దరు స్నేహితులతో కలిసి కుండేశ్వరం వేటాడేందుకు గురువారం అర్ధరాత్రి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ అడవి పందులను పట్టుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మేకల కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కార్తీక్‌తో వచ్చిన ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కార్తీక్ మృతదేహాన్ని చెరువులో పడేసి ఊబిలోకి పోయే విధంగా పూడ్చి వేశారు. ఈ కేసు లో నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు, సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి అధికారులు శుక్రవారం ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడుతూ ఏలేశ్వరంలో 20 లీటర్ల సారాతో ఒక మహిళను, పెద్దనాపల్లి, నెల్లిపూడి గ్రామంలో 20 బాటిళ్లు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను సారాను చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాసరావు, సిబ్బంది కృష్ణారావు, వెంకన్న దొర, దొరబాబు, రాంబాబు రాజు, రామకృష్ణ ఉన్నారు.


బాధితులకు సాయం అందిస్తున్న జాన్ వెస్లీ

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ఇటీవల రామవరం శివారు రంగవల్లి నగర్‌లో 7 గుడిసెలు అగ్నికి ఆహుతైన సంఘటనలో బాధితులకు శుక్రవారం రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ జాన్ వెస్లీ ప్రమాద బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు వైసిపి అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో బాధితులకు ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జార్జిబాబు, హిజ్ మినిస్ట్రీస్ అధినేత సురేంద్ర, శ్రీనివాస్, సుదర్శన్, జిమ్మి కార్టర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన రూ. 80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు శుక్రవారం ప్రారంభించారు. గతంలో వేట్లపాలెంలో చేపట్టిన గడపగడపకు కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై సిఎం వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి రూ.80 లక్షల నిధులను విడుదల చేసినట్టు దొరబాబు తెలిపారు. వాటితో గ్రామంలో పలుచోట్ల రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులను చేపట్టారు. వాటిని దొరబాబు ప్రారంభించారు. దొరబాబుకు ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి దొరబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలోనే గ్రామాలన్నీ విధాల అభివద్ధి సాధించినట్టు చెప్పారు. పేదల గుండెచప్పుడు తెలిసిన నాయకుడిగా సీఎం జగన్మోహన్ రెడ్డి గ్రామాభివద్ధికి, పేద, మధ్య తరగతి ప్రజల అభివద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోలి బాపిరాజు, నాయకులు తలారి దొరబాబు, మలకల సూరిబాబు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ పర్వత ప్రజా దీవెన యాత్ర

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ప్రజా దీవెన కార్యక్రమాన్ని పల్లపు చామవరం నుంచి శుక్రవారం చేపట్టారు. పర్వత కుటుంబికులు ఏ కార్యక్రమం చేపట్టిన ఈ గ్రామం నుంచి మొదలు పెట్టడం ఆనవాయితీ. ఈ ప్రజా దీవెన కార్యక్రంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జి.రమణమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు జిగిరెడ్డి శ్రీను, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, ఎసిబి డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు ఉన్నారు.

యానాం వార్తలు


నిరసనలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్, కృష్ణారావు

డంపింగ్ యార్డ్ పెట్టొద్దని నిరసన

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు వార్డులోని గోపాల్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డంపింగ్ యార్డ్,రిసోర్స్ రికవరీ పార్క్ పెట్టొద్దని శుక్రవారం గ్రామస్తులు నల్ల చెరువు గోపాల్ నగర్ జంక్షన్ వద్ద నిరసనకు దిగారు. తమ గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించకుండా పుదుచ్చేరి ప్రభుత్వం, అధికారులు మొండిగా వ్యవహరిస్తోంన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు తాము పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. స్థానికంగా రిసోర్స్ రికవరీ పార్క్ నిర్మాణం చేపడితే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటామని తమ గ్రామానికి ఆనుకుని స్కూల్స్, నవోదయ విద్యాలయ, ఉన్నాయని మునుముందు రోజుల్లో అక్కడ నివాసం ఉంటున్న ప్రజలకు అనారోగ్య సమస్యలకు దారితీస్తాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిరసనలో పాల్గొని తమకు మద్దతు తెలియజేయాలని స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధులను కోరినట్లు తెలిపారు. తమ సమస్యను ఇద్దరు ప్రజా ప్రతినిధుల మధ్య ఉంచామని దానిని పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్య ప్రకాష్ కోరారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రభుత్వం తన అభిప్రాయాన్ని మార్చుకుని జననివాసాలు లేని చోటుకి తరలించాలని కోరారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తమపై లేనిపోయి అబాండాలు వేయడం సరికాదన్నారు. తమ ఇద్దరికీ ఈ డంపింగ్ యార్డ్ పెట్టాలని ఉద్దేశం లేదని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తాము పూర్తి వ్యతిరేకమని తెలిపారు. ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ కనకాలపేట, భీమ్ నగర్, యూకెవి నగర్ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్ వల్ల ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దానిని వేరే చోటికి తరలించాలని నిరాహార దీక్ష చేసిన సమయంలో మంత్రులను అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామాడి అప్పారావు,పండు సిద్ధార్థ కుమార్,ఆకుల సతీష్, సంసాని, ఆరిశెట్టి రాజేష్, పంపన దుర్గారావు, కె.సుబ్బరాజు, మున్నా, గోపాల్ నగర్ మెట్టకూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. నాసిక్‌లో జరిగిన జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా యువకులు విద్యార్థులు అతిథులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వర్గు భాస్కర్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.వేలాయుధం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి గోపి, మన్నే కిరణ్, వినయ్ ఆంటోనీ పాల్గొన్నారు.

వికలాంగుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగులు ప్రత్యేక పాఠశాలలో చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను చిన్నారులకు తెలిపారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి సీగల్స్ రెస్టారెంట్ మురళి, ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణరెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎస్.తాతారావు, ప్రత్యేక ఉపాధ్యాయురాలు ఎం.సుశీల, ఉదయకుమారి, మహేశ్వరి, దివ్యాంగుల చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన దినోత్సవం

ప్రజాశక్తి-పిఠాపురం

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో నవచైతన్య జూనియర్ కళాశాల యువత శుక్రవారం యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మిత్రమండలి అధ్యక్షులు తోట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభ శ్రీచక్రధర్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు వెన్నపు చక్రధరరావు, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మిత్రమండలి గౌరవాధ్యక్షుడు సోషల్ వెల్ఫేర్ విశ్రాంత డిడి అప్పారావు వివేకానందుని జీవిత విశేషాలను యువతకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఊటుకూరు కేశవరావు, భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ పి.వేణు, వైద్యులు ఎన్.సూర్యనారాయణ, పోతుల శ్రీనివాస్, చిన్నారి సతీష్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల హెచ్చరికలు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు నిర్వహించే ప్రదేశాల్లో శుక్రవారం పోలీసు, రెవెన్యూయ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కోడి పందేలు నిర్వహించినా, బరులకు స్థలాలు ఇచ్చినా, జూదాలు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట రూరల్ ఈ నెల 12 వ తేదీ నుండి 22వ తేదీ వరకు 144 సెక్షన్ అమలలో ఉందని పండగ సమయంలో ఎటువంటి గొడవలు పడకూడదని జగ్గంపేట ఎస్ఐ నాగార్జున రాజు తెలిపారు. ఆయన వెంట తహశీల్దారు శ్రీదేవి, ఎంపిడిఒ వసంత కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు. **ఏలేశ్వరం** కోడిపందేలు, జూదాలపై కఠిన చర్యలు తప్పవని ప్రత్తిపాడు సిఐ ఎం.శేఖర్ బాబు హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో పామాయిల్ తోటల్లో పందేలకు గీసిన బరులను వారు ధ్వంసం చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆయన వెంట తహశీల్దార్ జి.చిన్నారావ్, ఎస్ఐ జి.సతీష్, విఆర్ఒ రొంగల శ్రీనివాస్ ఉన్నారు. **కిర్లంపూడి** మండలంలోని కోడిపందేల బరులను ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తహశీల్దార్ మాధవ రావు, ఎంపిడిఒ బడే రాజేశ్వరరావుతో పరిశీలించారు. వేలంక పంచాయతీ కార్యదర్శి వీర్రాజు పాల్గొన్నారు. **గండేపల్లి** ఎస్ఐ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దారు కెవివి.సత్యనారాయణ, ఎంపిడిఒ బిఎస్‌కె.రామన్ కోడిపందేల ప్రదేశాల్లో హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. **సామర్లకోట** సిఐ సురేష్, తహశీల్దారు ఎస్ఎల్ఎన్.కుమారి గ్రామాల్లో పర్యటించి కోడిపందేలు నిర్వహించే శిబిరాల వద్ద ఏర్పాట్లను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. **కరప** మండలంలో కోడి పందేల కోసం తయారు చేసిన బరులను ట్రాక్టర్‌తో దున్నించారు. రూరల్ సిఐ కె.శ్రీనివాస్, తహశీల్దారు పి.శ్రీనివాసరావు, ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.


కరపలో ట్రాక్టర్లతో బరిని దున్నిస్తున్న అధికారులు

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కరప

కరప నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో శుక్రవారం సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది.జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, సర్పంచ్ సాదే అశాజ్యోతికుమార్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గత 30 సంవత్సరాల నుంచి ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్న మధువీరేష్‌ను ఆయన అభినందించారు. మధువీరేష్ మాట్లాడుతూ ఈ ఏడాది శుక్రవారం నుంచి ఆరు రోజులపాటు సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ పిచ్‌ను తయారు చేయించామన్నారు. విజేతకు దేవు సూర్యనారాయణమూర్తి పేరున రోలింగ్ గోల్డ్ కప్ అందజేస్తామన్నారు. దీంతోపాటు విన్నర్, రన్నర్ జట్లకు పేపకాయల వరప్రసాద్, భోగిరెడ్డి వెంకటేశ్వరరావుల జ్ఞాపకార్థం ట్రోఫీలు అందజేస్తామని మధువీరేష్ తెలిపారు. పేపకాయల వరప్రసాద్, భోగిరెడ్డి వెంకటేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం ఎనిమిది గంటలకు మ్యాచ్‌ను క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ సత్తిబాబు, ట్రెజరర్ ఎన్.వెంకటేష్‌తో కలిసి టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.అప్పారావు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు బొండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైస్ ఎంపిపి పాట్నీడి సత్య భీమేశ్వరరావు (భీమన్న), నిర్వాహకులు నక్కా భీమ్, గోన శివ, దేవు శివ, సీఏకే ఫ్రెండ్స్ లెవెన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి, ఎంపిపి


ఏడు సీట్లలోనూ టిడిపి గెలుపు తథ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్న ఎన్నికల్లో కాకినాడ జిల్లాలో ఏడు సీట్లలో టిడిపి గెలుపు తథ్యమని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని ఇర్రిపాకలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తునిలో జరిగిన రా కదలిరా బహిరంగ సభ ఘనవిజయంతో జగన్ విధ్వంసకర పాలన, వైసిపి వైఫల్యాలు, స్థానిక సమస్యలు, స్థానిక నేతల అవినీతిపై గళమెత్తి హాజరైన అశేష జనవాహినిలో చంద్రబాబు జోష్ నింపారన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజలందరూ జగన్‌ను తిరస్కరిస్తుంటే ఆ పాపాన్ని ఎంఎల్‌ఎలపై నెట్టి సుమారు 70 మంది బిసి, ఎస్‌సి, వర్గాల ఎంఎల్‌ఎలపై వేటు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో యువత నిరుద్యోగులుగా మారారని రాష్ట్రంలో పరిశ్రమ ఒక్కటి కూడా రాలేదని ముందు ఉన్న పరిశ్రమ వైసిపి నాయకులు అవినీతి దెబ్బకు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయని అన్నారు. వైసిపి పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడి సంకీర్ణ ప్రభుత్వంతో మన రాష్ట్రానికి స్వర్ణ యుగం తేవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి కానుక

ప్రజాశక్తి- తాళ్లరేవు, సామర్లకోట రూరల్

తాళ్లరేవు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, కామాడి మాతరాజు, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ పాలకవర్గ సభ్యులు నూతన దుస్తులు అందజేశారు. పంచాయతీలోని 48 మంది కార్మికులకు ఒక్కొక్కరికీ రెండు జతలు అందించారు. సంక్రాంతి సందర్భంగా కార్మికులకు ఏటా సంక్రాంతి కానుకగా ఒక యూనిఫామ్, ఒక సివిల్ డ్రెస్ అందిస్తున్నట్లు సర్పంచ్ గోవ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, కామాడి మాతరాజు, నల్లి బాలకృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోందని సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైసిపి రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షులు ధవులూరు సుబ్బారావు పేర్కొన్నారు. 63 మంది పారిశుధ్య కార్మికులకు రెండు జతల దుస్తులను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీరెడ్డి అచ్యుతరాజు, ఇన్‌ఛార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ పిచ్చుక శ్రీనివాసరావు, కౌన్సిలర్ నేతల హరిబాబు,గంగిరెడ్డి కృష్ణమూర్తి, వారా సుధాకర్ పాల్గొన్నారు.

వైసిపి నుంచి 119 మంది టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కిర్లంపూడి

సోమరాయణంపేటలో బిసి నాయకులు పెనగంటి బాబ్జి ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 119 మంది శుక్రవారం టిడిపిలో చేశారు. ఉప సర్పంచ్ కనిశెట్టి వీరబాబు, వార్డు సభ్యులు బొడ్డేటి రమణ, రాపేటి హరికష్ణ, కాళ్ల సత్య లోకేష్ రావు, రాపేటి సుబ్బారావు, మళ్ల హరికృష్ణ, రాపేటి హరికృష్ణ, కాళ్ల కామరాజు, కొండపల్లి అప్పన్న దొర తదితరులు టిడిపి నేత జ్యోతుల నెహ్రూ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వీరికి నెహ్రూ పార్టీ కండువా వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి మీద నామీద అభిమానంతో వందలాదిమంది టిడిపిలో చేరడం విజనరీ నాయకుడు చంద్రబాబు, పోరాట యోధుడు పవన్ కల్యాణ్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం రాబోతోందన్నా. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాఠంశెట్టి మురళీకృష్ణ, నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, పిలా మహేష రావు, బుద్దా రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు కోసం మానవహారం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక భూ హక్కు చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు వివిధ ప్రజా సంఘాలు ప్రత్తిపాడులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు న్యాయవ్యవస్థను ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకోవాలని తీసుకొచ్చిన ఈ చట్టం ద్వారా చిన్నసన్న కారు రైతులు, పేదల ఆస్తికి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బుగతా శివ, న్యాయవాదులు ఆడారి సుగుణ, రాజాల చిట్టిబాబు, ఆకుల హరిబాబు, కాపిశెట్టి శ్రీనివాసరావు, కిలపర్తి శ్రీనివాసు, ప్రజా సంఘాల నాయకులు మానుకొండ లచ్చబాబు, తాడి నాగేశ్వరరావు, జింకల అప్పారావు, తూము చల్ల బాబు ఉన్నారు. **పిఠాపురం** న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో కొంగు నూకరాజు, అల్లం నాగేశ్వరరావు, గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు, ఎం.సత్యవతి కూర్చున్నారు. వారికి బహుజన సమాజ్ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ ఖండవల్లి లోవరాజు మద్దతు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజారావు, కెఎస్ఆర్.భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎస్ఎం.ఆలీ, బత్తిన లక్ష్మణదొర, ముమ్మిడి రామకృష్ణ, వివి.నగేష్, బంగారు రామకృష్ణ, బివివి.సత్యనారాయణ రాజు, వైవిఎస్.మూర్తి, మనోజ్ కుమార్ పాల్గొన్నారు. **పెద్దాపురం** ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని మాజీ కేంద్రమంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తుందన్నారు.

కార్మిక చైతన్య యాత్ర బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ, తాళ్లరేవు

వైసిపి ప్రభుత్వంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, టిడిపి హయాంలో కార్మికులకు చేయూతనిచ్చి ఆదుకున్నామని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కార్యాచరణ చేపట్టేందుకు టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు టెక్కలి నుంచి కుప్పం వరకు తలపెట్టిన కార్మిక బస్సు చైతన్య యాత్ర శుక్రవారం కాకినాడ వచిచంది. మెయిన్ రోడ్డు సూపర్ బజార్‌లో రఘురామరాజు, కొండబాబు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప జెండా యాత్రను ఈ సందర్భంగా రఘురామరాజు, కొండబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో వివిధ వర్గాల కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మికులకు భరోసా కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ ఈ యాత్ర చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్రంలో కోటీ 53 లక్షల కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం పెంచిన ధరలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గదుల సాయిబాబా, తాతపూడి రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్ బాబు, సబ్బతి పనేశ్వరరావు, నగర కమిటీ అధ్యక్షులు మల్లిపూడి వీరు, గుజ్జు బాబు, పసుపులేటి వెంకటేశ్వరరావు, నాయకులు పెనుపోతు రాము, అంగాడి దుర్గారావు, కర్రి సుబ్బారావు, ఓలేటి పాండురంగ, శేరు శ్రీనివాస్, బలగం పరశురామ్, అన్నవరం, చెన్నంశెట్టి గోవిందరాజు, దాసరి శ్రీను, కర్రి రాజారావు, దాసరి మణి, మల్లి, పులపకూర శ్రీనివాస్, పొంగా బుజ్జి పాల్గొన్నారు. టిఎన్‌టియుసి కార్మిక చైతన్య యాత్రకు తాళ్ళరేవులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక సంతపేట సెంటర్లో మాజీ ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, టేకుమూడి లక్ష్మణరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, రోళ్ల చక్రవర్తి, వినోద్, చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

స్వామి వివేకానంద జయంతిని పట్టణం, మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నీలమ్మ చెరువు వద్దగల శ్రీ వివేకానంద గ్రంథాలయం వద్ద వివేకా నంద సేవా సమితి ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామరావు ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు మాట్లాడారు. వివేకానంద విగ్రహానికి, చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లో జి.రాజు ఆధ్వర్యాన ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ నేతల హరిబాబు, భద్రరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పొడుగు చిట్టిబాబు, రామకృష్ణ, కాపుగంటి పైడిరత్నం పాల్గొన్నారు. పెద్దబ్రహ్మదేవంలో శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. వింజమూరి విశ్వనాథ్, నువ్వుల వెంకటరాజు, నువ్వుల బాబ్జి, టి.రాంబాబు, పడాల భరత్ కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ

పూర్తి వరి నాట్లకు సహకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలో నూరు శాతం వరి నాట్లు పూర్తయ్యేలా రైతులకు సహాయ సహకారాలు అందించాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఇనుకొండ వీర విష్ణు చక్రం అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వ్యవసాయ శాఖ ఎడిఎ నల్లి దైవకుమార్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలకు సరిపోయినన్ని ఎరువులు రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. నానో యూరియా వినియోగం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ప్రతి గ్రామంలో టీకాలు వేయించాలన్నారు. ఎఒ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో ధాన్యం అమ్మిన రైతులందరికీ ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి చిలకమ్మ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎన్‌జప్రసాద్, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.